క్లుప్తంగా

చెక్కు అందజేత



బాలుడి కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును అందజేస్తున్న ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: బోన్‌మారో వ్యాధితో బాధపడుతున్న నాలుగేళ్ల బాలుడికి వైద్యం నిమిత్తం ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.3 లక్షలను బాలుడు కుటుంబానికి కాకినాడ ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లాలు శుక్రవారం కలెక్టరేట్‌లో అందజేశారు.

సామాజిక కార్యకర్త అనపాలకు సన్మానం

కాకినాడ రూరల్: వేసవిలో వేలాది మంది దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ద్వారా మజ్జిగ, చల్లని నీటిని అందిస్తున్న సామాజిక కార్యకర్త అనపాల ఆంజనేయరెడ్డిని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, రిటైర్డ్ తహసీల్దార్ బాపిరాజు, ఆధ్యాత్మిక వేత్త శిరీష, రెడ్నం రాజా, రాఘవరావు తదితరులు ఆంజనేయరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు పక్కన ప్లాస్టిక్ సామాగ్రిని అమ్ముకునే ఆంజనేయరెడ్డి సొంత సొమ్ములతో 23ఏళ్లుగా ఏటా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ఏడుగురికి కారుణ్య నియామకాలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన కుటుంబీకులకు సంబంధించిన వ్యక్తులకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కృతికా శుక్లా కారుణ్య నియామకం కింద ఏడుగురికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మూగజీవాల సేవతో సంతృప్తి

బోట్‌క్లబ్: మూగజీవాలకు అందించిన సేవలు ఎప్పుడూ సంతృప్తినిస్తాయని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి సూర్యప్రకాశరావు అన్నారు. ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో శుక్రవారం ఉత్తమ వైద్య సేవలందించిన పశువైద్యాధికారులకు పురస్కారాలు అందించారు. ఈ ఏడాది కాకినాడ జిల్లాలో ఉత్తమ సేవలందించిన మల్లిశాల పశువైద్యాధికారి కొల్లి స్వప్నను ఉత్తమ పశువైద్యాధికారి అవార్డుతో సత్కరించారు. పశుసంవర్ధకశాఖ డీడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా ఇళ్ల నిర్మాణం

కాకినాడ సిటీ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై వర్చువల్‌గా నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణతో కలిసి పాల్గొన్న అనంతరం అధికారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలుపై దృష్టి సారించి, లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మే 9న జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభం, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, హౌసింగ్ పీడీ బి సుధాకర్‌పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీల బ్యాంకు లింకేజీపై ప్రత్యేక దృష్టి

కాకినాడ: గృహ నిర్మాణ లబ్ధిదారులుగా ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.35 వేల బ్యాంక్ లింకేజీ మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు కోరారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో శుక్రవారం బ్యాంకు లింకేజీ ప్రగతిపై మెప్మా, నగరపాలక సంస్థ అధికారులు, సీఓలు, ఆర్‌పీలతో ఏడీసీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కొమరగిరి లేఅవుట్‌కు సంబంధించి 16,000 మంది గృహనిర్మాణ లబ్ధిదారులకు గాను 9,691 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉన్నారన్నారు. వీరిలో 4908 మందికి బ్యాంకు లింకేజీ మంజూరు అయ్యిందన్నారు. మరో 6,500 మంది ఎస్‌హెచ్‌జీలలో లేనందున వారిని కూడా గ్రూపుల్లో చేర్చి రుణాలు మంజూరయ్యే ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కమిషనర్ కోరారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రియంవద, టపీఆర్‌ఓ మానే కృష్ణమోహన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వెంకట్ రాజు సమావేశానికి హాజరయ్యారు.

ఇంగ్లిష్ లాంగ్వేజ్ ల్యాబ్ ప్రారంభం

బాలాజీచెరువు: యూనివర్సిటీ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడ కళాశాలలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ భవనంలో ఏర్పాటు చేసిన ఇంగ్లిష్ లాంగ్వేజ్ ల్యాబ్‌రేటరీని వీసీ ప్రసాదరాజు శుక్రవారం ప్రారంభించారు. బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 66 కొత్త కంప్యూటర్లతో ఇంగ్లిష్ ల్యాబ్ ఏర్పాటు చేశామని, భాషపై పట్టు సాధించేందుకు ఉపయోగపడుతుందన్నారు. రెక్టార్ కేవీ రమణ,రిజిస్ట్రార్ సుమలత, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

చెత్త శుద్ధి.. సంపద వృద్ధి

- స్వచ్ఛ సంకల్ప స్ఫూర్తితో ఆదర్శంగా కొవ్వాడ
- గ్రామంలోనే లోకల్ ట్రైనింగ్ సెంటరు

కాకినాడ రూరల్: పల్లెలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్రంలో జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా నెరవేరుతోంది. కాకినాడ రూరల్ మండలంలో చెత్త నుంచి సంపద తయారీతో స్వచ్ఛ గ్రామాలుగా మారుతున్నాయి. మొత్తం 18 గ్రామాలకు గాను 14 గ్రామాలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నెలకొల్పి వాటి ద్వారా గ్రామస్తుల నుంచి సేకరించే చెత్తగా పొడి, తడిగా వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారు. ఆయా గ్రామాలలో కొవ్వాడ, వాకలపూడి పంచాయతీలు ఆదర్శంగా నిలిచాయి.



కొవ్వాడలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీ చేసే కుండీలు

ముఖ్యంగా కొవ్వాడ పంచాయతీ ఆదర్శవంతంగా నిలవడంతో లోకల్ ట్రైనింగ్ సెంటరు స్థాయికి ఎదిగింది. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు ఇక్కడ శిక్షణ అందిస్తున్నారు. గ్రామంలో సుమారు 2,200 కుటుంబాలు ఉండగా రేపూరు వెళ్లే మార్గంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని 2020లో ఏర్పాటు చేశారు. గ్రామస్తుల నుంచి సేకరించే పొడి చెత్తను నేరుగా విక్రయిస్తుండగా తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు, ఇళ్ల వద్ద మొక్కలు పెంచుకునే వారికి కేజీ రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు.

స్వచ్ఛ గ్రామంగా నిలుపుతున్నాం

గ్రామంలో మొత్తం 22మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నారు. మండల స్థాయిలో ఇక్కడ శిక్షణ ఇస్తుండడంతో గ్రామాన్ని మోడల్‌గా ఉంచేందుకు శ్రమిస్తున్నాం. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీపీ, గ్రామస్తుల సహకారంతో స్వచ్ఛ గ్రామంగా నిలుపుతున్నాం.

– వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, కొవ్వాడ, కాకినాడ రూరల్

మెరుగ్గా పారిశుధ్యం

కాకినాడ రూరల్ మండల పంచాయతీల్లో మెరుగ్గా పారిశుధ్యం ఉండేలా పర్యవేక్షణ చేస్తున్నాం. జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా చెత్త నుంచి సంపద కేంద్రాలు సమర్థవంతంగా నడుపుతున్నాం. కొవ్వాడ మోడల్ విలేజ్‌గా ఉండడంతో ఇక్కడ చెత్త నుంచి సంపద కేంద్రం ద్వారా మండలంలోని వారికి శిక్షణ అందిస్తున్నాం.

– బాలాజీ, ఈఓ పీఆర్ అండ్‌ఆర్‌డీ, కాకినాడ రూరల్

పేదల అభ్యున్నతే ధ్యేయం

కాకినాడ: పేదల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన జరుగుతోందని, అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాకినాడ అర్బన్ రెండవ డివిజన్ సచివాలయం ఎ పరిధిలోని రమణయ్యపేట శెట్టిబలిజపేట కొత్తూరు ప్రాంతంలో శుక్రవారం ఎమ్మెల్యే ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వం ద్వారా నాలుగు సంవత్సరాల్లో పొందిన ఇళ్ళ పట్టాలు, సంక్షేమ పథకాలు లబ్ధిని తెలియజేశారు. అందుకు సంబంధించిన బుక్‌లెట్‌లను అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు మరోసారి ఆశీస్సులు అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్థానికులు కొంతమంది పింఛన్లు, రేషన్ కార్డులు కావాలని కోరడంతో అధికారులను పిలిపించి ఏ కారణంగా నిలుపుదలచేశారో తెలుసుకుని, అర్హత ప్రకారం పునరుద్ధరించాలని ఆదేశించారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ గడపగడపకూ పూర్తి అయిన సచివాలయాల పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 20లక్షలతో రోడ్లు, డ్రైనేజీలు వంటి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, స్థానిక నాయకులు పాటి సూరిబాబు, గుత్తుల సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఒకటి నుంచి భగవద్గీత ఉచిత కంఠస్థ శిక్షణ

బోట్‌క్లబ్: విశ్వహిందూ పరిషత్ కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో బాల సంస్కార్ శిబిరం పేరుతో భగవద్గీత ఉచిత కంఠస్థ శిక్షణ తరగతులు, వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాలు మే 1 నుంచి 31 వరకూ జరుగుతాయని పరిషత్ సభ్యులు గరిమెళ్ల అన్నపూర్ణయ్య శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ గాంధీనగర్‌లోని అన్నపూర్ణ నిలయంలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో పరిషత్ ఆధ్వర్యంలో జరిగే ప్రఖండ, జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలకు ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతీ స్కూల్‌కి భగవద్గీత పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం విభూతి యోగం 10 అధ్యయనంపై పోటీలు ఉంటాయన్నారు.

సమన్వయ కృషితో ప్రగతి

'దిశ' సమావేశంలో ఎంపీ గీత

కాకినాడ సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి స్థాయిలో ఫలితాలు వచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీత కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో మాట్లాడారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం), ప్రధానమంత్రి మాతృవందన యోజన, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ), ఐసీడీఎస్ కొత్త ప్రాజెక్టులు, మిషన్ వాత్సల్య, దిశ వన్‌స్టాప్ సెంటర్, భూసార విశ్లేషణ ఫలితాల కార్డు (ఎస్‌హెచ్‌సీ), పరంపరాగత్ కృషి వికాస్ యోజన, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితరాల పురోగతిని సమీక్షించి మరింత మెరుగ్గా ఫలితాలు వచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ యువతకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమంపై మండలాల వారీగా అవగాహన కల్పించాలన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం 86 యూనిట్లు కాగా 135 యూనిట్లు ప్రారంభమైనట్లు తెలిపారు. 2022–23లో క్లస్టర్లలో 32,560 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గీత, చిత్రంలో జెడ్పీ చైర్మన్ వేణుగోపాల్, కలెక్టర్ కృతికా శుక్లా

వ్యవసాయాధికారులు వివరించగా జీవామృతం, కషాయాల తయారీ వంటి వాటిపై ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసుకుంటూ రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీ గీత సూచించారు. 385 గ్రామ పంచాయతీల్లో గ్రామీణ పేదలకు ఉపాధి కల్పన, ఉపాధి వేతనాలు సకాలంలో చెల్లింపులు, గ్రామీణ సుస్థిర ఆస్తుల కల్పన తదితర అంశాలను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మి వివరించారు. పునర్వ్యవస్థీకరణతో కాకినాడ జిల్లాలో 8 రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టులను, ఒక కార్పొరేషన్ ప్రాజెక్టును ఏర్పాటు చేసినట్లు ఐసీడీఎస్ పీడీ ప్రవీణ వివరించారు. జిల్లాలో 1927 మెయిన్, 59 మినీ మొత్తం 1986 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయన్నారు. 18 ఏళ్ల లోపు రక్షణ లేదా సంరక్షణ అవసరమైన పిల్లలకు స్పాన్సర్ షిప్ ద్వారా నెలకు రూ.4 వేలు అందించే కేంద్ర ప్రాయోజిత పథకం మిషన్ వాత్సల్య సజావుగా అమలయ్యేలా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు.

రోజుకొక గంట లైబ్రరీకి

కరప: పాఠశాల స్థాయి నుంచి రోజుకొక గంట లైబ్రరీకి కేటాయించి, పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 1995–96 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు రూ.లక్షతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించి, విద్యార్థులతో మాట్లాడారు. పుస్తక పఠనంతో విజ్ఞానవంతులవ్వడమే కాకుండా నడవడిక కూడా మారుతుందన్నారు. విద్యార్థులు తమ పుట్టినరోజులకు, పాఠశాలకు అతిథులు వచ్చినప్పుడు అనవసర ఖర్చులు చేయకుండా ఆ డబ్బుతో మంచిపుస్తకాలు కొనుగోలుచేసి, లైబ్రరీకి డొనేట్ చేయాలని సూచించారు. టెన్త్‌కి వచ్చేసరికే జీవిత లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దానిని సాధించేవరకు శ్రమించాలన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే అరకొర వసతులతో ఉండేవని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నాడు–నేడు పథకంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. లైబ్రరీని ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థులు తుమ్మలపల్లి సత్తిబాబు, మండ రవి, తోట రామారావు, నెమ్మది సత్యనారాయణను ఎమ్మెల్యే అభినందించారు. ఎంపీడీఓ కర్రె స్వప్న, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, హెచ్‌ఎం యు.లీలామనోహర్, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ

కాకినాడ రూరల్: ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ అని విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతమ్మ చిత్రపటానికి బాపిరాజు, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా, సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ గోదావరి జిల్లాల్లో నిత్య అన్నదాతగా సీతమ్మ ప్రసిద్ధి పొందారన్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా పలు ఇబ్బందులకు గురైన వారిని ఆదుకుంటూ వచ్చిన వారికి లేదనకుండా అన్నదానం చేసిన మహా ఇల్లాలు సీతమ్మ అన్నారు.

ఘనంగా భగళాముఖి జయంతి

బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో భగళాముఖి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆధ్యాత్మిక వేత్త వేదుల శిరీష మాట్లాడుతూ హిందూమతంలో కాళికాదేవి దశావతారాలలో భగళాముఖి అవతారం ఒకటని అన్నారు.

శాస్త్రీయ విద్య కోసం పోరాడుదాం

కాకినాడ సిటీ: శాస్త్రీయమైన విద్య కోసం నేటి విద్యార్థులు పోరాడాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కాకినాడ యూటీఎఫ్ భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం శాస్త్రీయమైన విద్యకు పాతరేస్తోందన్నారు. సీబీఎస్ఈ సిలబస్‌లో జీవపరిణామ సిద్ధాంతాన్ని తీసివేశారన్నారు. విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దినేష్‌కుమార్ వివరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు టి.రాజా, ఎం.గంగా సూరిబాబు, సిద్ధు, రోజా పాల్గొన్నారు.

మోదీ ప్రజలను ఐక్యం చేస్తున్నారు

బోట్‌క్లబ్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మనసులో మాట రేడియో కార్యక్రమం ద్వారా దేశప్రజలందరినీ ఐక్యం చేస్తున్నారని బీజేపీ రాష్ట్రమీడియా ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ కొనియాడారు. కాకినాడలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ నెల చివరి ఆదివారం ఉదయం 11 గంటలకు దేశ ప్రజల్ని ఉద్దేశిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేడియో ద్వారా దైనందిన జీవితంలో వివిధ ప్రాంతాల ప్రజలు చేస్తున్న స్ఫూర్తిదాయక కార్యక్రమాలను తెలియజేస్తున్నారన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అన్న భారత సాంస్కృతిక విధానాన్ని చాటుతున్నారన్నారు. గతంలో పెద్దాపురం మరిడమ్మ ఆలయ జాతర విశేషాల నుంచి ఈశాన్య రాష్ట్రాల్లో అవలంబిస్తున్న నూతన విధానాల వరకూ అనేక విశేషాలు ప్రజలకి తెలియజేస్తూ విజ్ఞానాన్ని వినోదాన్ని పంచుతున్నారన్నారు. ఈ మనసులో మాట కార్యక్రమం ఏప్రిల్ 30న వంద నెలలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని వీక్షించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

కరప: గ్రామ సమీపంలో కాకినాడ–రామచంద్రపురం ప్రధాన రహదారిలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం వ్యవస్థాపకులు చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరులు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు ప్రారంభించారు.

అంగన్‌వాడీల ధర్నా

కాకినాడ సిటీ: పెండింగ్‌లో ఉన్న వేతనాన్ని చెల్లించాలని, అర్హులకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.ప్రవీణకు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ, సీఐటీయూ నాయకులు జి.బేబీరాణి, దడాల పద్మ, చంద్రావతి, దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, రాజేశ్వరి పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీలు కీలకం

కాకినాడ రూరల్: పాఠశాలల అభివృద్ధిలో పేరెంట్స్ కమిటీలు కీలకమని, వాటిని కలుపుకొని ఉపాధ్యాయులు ముందుకు వెళ్లాలని కాకినాడ డీవైఈఓ ఆర్‌జేడీ రాజు పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోషల్ ఆడిట్‌పై ఒక్కరోజు శిక్షణ తరగతిని ఎంఈఓ ఎల్.గణేష్‌బాబు అధ్యక్షతన శుక్రవారం గంగరాజునగర్ ఆదిత్య స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన, డ్రాప్ అవుట్‌లు లేకుండా చేయడం, మధ్యాహ్నం భోజనం, పారిశుద్యం, నాడు – నేడు పనులు పర్యవేక్షణ తదితర అంశాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. రీసోర్స్ పర్సన్ పి.శేఖర్ శిక్షణ అందించగా 58 ప్రాథమిక, నాలుగు ప్రాథమికోన్నత, 14ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ డీడీకి జనసేన వినతి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వేట విరామ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వ పరిహారం అందించాలని కోరుతూ కాకినాడ జిల్లా మత్స్యశాఖ డీడీ సత్యనారాయణకు జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు పంతం నానాజీ, కందుల దుర్గేష్, పార్టీ మత్స్యకార విభాగ అధ్యక్షుడు బి.నాయకర్ పాల్గొన్నారు.

తోలుబొమ్మలాట కులస్తులను బీసీల్లో చేర్చడంపై హర్షం

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం తోలుబొమ్మలాట కులస్తులను బీసీ బీ జాబితాలో చేర్చడంపై జయహో తోలుబొమ్మలాట సదస్సు హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం కాకినాడ కచేరిపేట సుందరయ్యభవన్‌లో నిర్వహించిన సదస్సులో కవి, రచయిత విశ్రాంతి తహసీల్దార్ గౌరీనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం తోలుబొమ్మలాట కులస్తులకు విడుదల చేసిన జీవో నంబర్ 8 ఆధారంగా కులధ్రువీకరణ పత్రాలు ఎలా తీసుకోవాలనే దానిపై సదస్సులో పాల్గొన్న సంఘ నాయకులకు వివరించారు. తోలు బొమ్మలాట వృత్తి కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు అనపర్తి ఏడుకొండలు మాట్లాడుతూ 2008 నుంచి అనేక పర్యాయాలు బీసీ కమిషన్‌కు తమ కులం గుర్తింపు కోసం విజ్ఞప్తి చేస్తూనే ఉన్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ బీ ధ్రువీకరణ పత్రాలు తీసుకునే విధంగా జీవో ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. సీపీఎం నాయకులు



బీసీ బీ జాబితాలో చేర్చిన జీవో కాపీలను ప్రదర్శిస్తున్న నాయకులు

ఎం. రాజశేఖర్, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ సీహెచ్ అజయ్‌కుమార్, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు చైతన్యరెడ్డి, ఐద్వా సంఘం జిల్లా నాయకురాలు సీహెచ్ రమణి, ఎం.రమణమ్మ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో కాపీలను సంఘం నాయకులు, సభ్యులకు అందజేశారు.

పాఠశాల నిధులు సక్రమంగా వినియోగించాలి

కరప: ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే నిధులను పేరెంట్స్ కమిటీ సభ్యులు, హెచ్‌ఎంలు నిబంధనల మేరకు తీర్మానాలు చేసి, పాఠశాలల ప్రగతికి వినియోగించాలని సోషల్ ఆడిట్ జిల్లా పరిశీలకులు, సీఎంఓ చామంతి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పాఠశాలల్లో నిర్వహించే సామాజిక తనిఖీపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి అధ్యక్షతన జరిగిన ఒకరోజు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, పిల్లల మానసిక స్థితి రక్షణ, ఉపాధ్యాయుల పనితీరు తదితర ఆరు అంశాల ప్రాతిపదికన నిధులు వినియోగించి, పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు. నాలుగునెలలకొకసారి తనిఖీచేసి నివేదికలు ఇవ్వాలన్నారు. సామాజిక తనిఖీలలో లెవెల్–1,2,3,4 ఆధారంగా పాఠశాలలకు నిధులు మంజూరు చేస్తామని సీఎంఓ నాగేశ్వరరావు తెలిపారు. రీసోర్స్ పర్సన్ ఎం.సత్యనారాయణమూర్తి, ఎంఈఓ బుల్లికృష్ణవేణి సోషల్ ఆడిట్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

రిబేటుకు రెండు రోజులే గడువు

కాకినాడ: ఆస్తి, ఖాళీ స్థలాల పన్నును ఐదు శాతం రిబేటుపై చెల్లించేందుకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ చెప్పారు. ఏప్రిల్ 30వ తేదీతో గడువు ముగియనున్నందున పన్ను చెల్లింపుదారులంతా ఈ నెల 30వ తేదీ లోపుగా ముందస్తుగా పన్నులు చెల్లించాలన్నారు. ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం ఆస్తిపన్నును ఏకమొత్తంగా చెల్లించిన వారికి మాత్రమే ఐదు శాతం రిబేటు వర్తిస్తుందని చెప్పారు. ఆదివారం కూడా కౌంటర్లలో పన్నులు స్వీకరిస్తామని చెప్పారు.

నేటి నుంచి శివాలయం పునఃప్రతిష్ఠా మహోత్సవాలు

కరప: పునర్నిర్మించిన నడకుదురు శివాలయం ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం నుంచి మే నెల 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. బ్రహ్మశ్రీ యేలూరిపాటి ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయి. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చొరవతో రూ.33.3 లక్షల గ్రామస్తుల కంట్రిబ్యూషన్, రూ 66.7 లక్షల దేవదాయశాఖ నిధులతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ నెల 29న గణపతి పూజ అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో గ్రామోత్సవరం నిర్వహిస్తారు. 30న మంటపారాధన, హోమాలు, మే ఒకటో తేదీన బింబశుద్ధి, ధాన్యాధివాసం, 2న ఉదకశాంతి, కలశ స్థాపన, హోమాలు నిర్వహిస్తారు. 3న ఉదయం 7.14 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, శాంతికళ్యాణం నిర్వహిస్తామని ఈఓ మోర్త మురళీవీరభద్రరావు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మిడి రత్నకుమార్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

జోరుగా జగనన్నే మా భవిష్యత్తు

కరప: మండల పరిధిలో గ్రామసచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, పార్టీశ్రేణుల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శుక్రవారం జోరుగా సాగింది. నడకుదురు, గురజానాపల్లి, గొడ్డటిపాలెం, విజయరాయుడుపాలెం, కొరిపల్లి, వలసపాకల, వేములవాడ, వాకాడ, వేళంగి, పెద్దాపురప్పాడు, పాతర్లగడ్డ, కరప గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న పథకాలు, పాలనపై సర్వే నిర్వహించారు. అడగకుండానే సంక్షేమ పథకాల ద్వారా ఆదుకుంటున్నారని, అటువంటి ముఖ్యమంత్రి జగనే మళ్లీ మళ్లీ రావాలని, అందుకు జగనన్నే మానమ్మకం అంటూ గృహిణులు మద్దతు ప్రకటించి, తమ ఇంటి తలుపులపైన, గేట్లపైన జగనన్నే మానమ్మకం స్టిక్కర్లను అతికించుకున్నారు. తమ మొబైల్‌ఫోన్ల నుంచి మిస్డ్‌కాల్స్ ఇచ్చి, జగనన్న పాలనకు మద్దతు ప్రకటించారు.



గురజనాపల్లిలో గృహిణికి కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం

వివిధ గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్‌డీపీవో

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా పెద్దాపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన లతా కుమారి శుక్రవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కాకినాడలోని పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దాపురం సబ్ డివిజన్‌లో శాంతి భద్రతలపై చర్చించారు.

సెట్రాజ్ కార్యాలయాన్ని సందర్శించిన కమిషనర్

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని సెట్రాజ్ కార్యాలయాన్ని యువజన సర్వీసులశాఖ కమిషనర్ కె.శారదాదేవి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా యువత అభివృద్ధిపై శాఖాపరంగా జరుగుతున్న వివిధ కార్యక్రమాల గురించి అధికారులతో సమీక్షించడంతోపాటు పలు మండలాల నుంచి వచ్చిన యువజనులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కొత్తగా ఏర్పడిన యువజన సంఘాలకు యువజన సంక్షేమశాఖ ద్వారా గుర్తింపు పత్రాలను ఆమె పంపిణీ చేశారు. సెట్రాజ్ సీఈవో షేక్ ఇమ్రాన్, మేనేజర్ కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్

ఎమ్మెల్యే కన్నబాబు

కరప: కోట్లాదిమంది జీవితాల్లో వెలుగులు నింపిన భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు పేర్కొన్నారు. యండమూరులో శుక్రవారం ఆది ఆంధ్ర కూలీసేవాసంఘం, అంబేడ్కర్ యువజన సేవాసంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను నిర్వహించారు. కన్నబాబు అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఒక వర్గానికో, ఒక మతానికో చెందినవాడు కాదని, అన్నివర్గాల ప్రజల ఆకాంక్షల మేరకు రాసిన రాజ్యాంగంతోనే స్వేచ్ఛా,స్వాతంత్ర్యాలు అనుభవిస్తున్నామన్నారు. అంబేడ్కర్ కల్యాణ మంటపం ఆధునీకరించాలని, ఎస్సీ వీధులలో సీసీ డ్రెయిన్లు, రోడ్లు నిర్మించాలని కోరగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, గ్రామ సర్పంచ్ మార్నెళ్ల శ్రీనివాస్(శివ), మాజీ సర్పంచ్ మార్నెళ్ల వెంకటరమణ, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు పాల్గొన్నారు.

సమన్వయంతో పూడికతీత

కాకినాడ: ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగాల సమన్వయంతో పూడిక తీత పనులు వేగవంతం చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శుక్రవారం పూడిక తీత పనులు, యూజర్‌చార్జీల వసూళ్లపై ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగాల అధికారులతో ఏడీసీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు పడేలోపు కల్వర్టులు, మేజర్ డ్రైన్లలో పూడిక తీత పనులు పూర్తికావలసి ఉందన్నారు. యూజర్‌చార్జీలు వసూళ్ళపై ఏడీసీ నాగనరసింహారావు అధికారులతో సమీక్షించారు. మెరుగైన పారిశుధ్య సేవల కోసం వసూళ్ళు చేస్తున్న యూజర్ చార్జీలను ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా చెల్లించాలని స్పష్టం చేశారు.

టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ –42 రోజుల సమ్మర్ ట్రైనింగ్ కోర్సుకు మే 15వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా రూ.వెయ్యిరూపాయలు ఫీజు చెల్లించాలని డీఈఓ కేవీఎస్ఎస్ అన్నపూర్ణ శుక్రవారం తెలిపారు. చెల్లించిన ఫీజు చలానాలను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని తరగతులు మే 1వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకూ ఉంటాయని, 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు ఉండి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు.